ఖాళీ స్థలం.. చెత్తకు నిలయం

- గోల్డెన్ కేవ్ రెస్టారెంట్ ముందున్న ఖాళీ స్థలంలో చెత్తాచెదారం
- చెత్తకు నిప్పు.. ఎగిసి పడుతున్న మంటలు
- దట్టమైన పొగతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న సత్యసాయి అపార్ట్‌మెంట్ వాసులు
- పట్టించుకోని జీహెచ్‌ఎంసీ అధికారులు





గోల్డెన్ కేవ్ రెస్టారెంట్ ముందున్న ఖాళీ స్థలంలో పేరుకుపోయిన చెత్త కుప్పలు, చెత్తకు నిప్పు పెట్టడంతో భారీగా మంటలు, మంటలను ఆర్పివేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అమీర్‌పేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట ఐసీఐసీఐ బ్యాంక్ వెనుక ఉన్న గోల్డెన్ కేవ్ రెస్టారెంట్ ముందున్న ఖాళీ స్థలంలో కొందరు హాస్టళ్ల నిర్వాహకులు చెత్త వేస్తున్నారు. రోజూ తెల్లవారగానే టన్నుల కొద్దీ చెత్తను వివిధ ప్రాంతాలను నుంచి తీసుకొవచ్చి ఇక్కడ వేస్తున్నారు. చెత్త కుళ్లిపోయి పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వస్తోంది. ఈవిషయమై పలుమార్లు జీహెచ్ ఎంసీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని సత్యసాయి అపార్ట్‌మెంట్ వాసులు తెలిపారు. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి చెత్తకు నిప్పు అంటిస్తుండడంతో మంటలు ఎగిసిపడుతున్నాయి. దట్టమైన పొగతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నామని సత్యసాయి అపార్ట్‌మెంట్ వాసులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకోవాలి

ప్రధానంగా ఈస్థలం పక్కనే ఉన్న అమీర్ ఎస్టేట్‌లో పేయింగ్ గెస్ట్‌లుగా ఉంటున్న విద్యార్థులు రోజూ చెత్తను పారేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. వారం రోజుల క్రితం చెత్తకు నిప్పు అంటుకుని భారీగా మంటలు ఎగిసి పడడంతో సత్యసా యి అపార్ట్‌మెంట్ వాసులు భయాందోళనకు గురై అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. తక్షణమే చేరుకున్న సిబ్బంది మంటలను ఆర్పీ వేశారు. ఈ అపార్ట్‌మెంట్‌లో 52 కుటుంబాలు నివసిస్తున్నాయి. ప్రతిరోజూ చెత్త తగలబడుతుండడంతో ఆ వేడి, పొగ నేరుగా అపార్ట్‌మెంట్‌లోకి వెవస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఉన్న ఖాళీ స్థలంలో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఈ స్థలం ప్రభుత్వానిదా.. ప్రైవేట్ వ్యక్తులదా..?

గోల్డెన్ కేవ్ రెస్టారెంట్ ముందున్న అర ఎకరం పైగా ఉన్న ఖాళీ స్థలం ప్రభుత్వానిదా, లేక ప్రైవేట్ వ్యక్తులదా అనే విషయం తెలియదు. ఈవిషయంపై హెచ్‌ఎండీఏ అధికారులకు ఫిర్యాదు చేయగా.. పరిశీలిస్తామని చెబుతున్నారే తప్ప ఒక్కసారి కూడా రాలేదని సత్యసాయి అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వాహకులు వాపోతున్నారు. ఈ స్థల వివాదం కోర్టు పరిధిలో ఉందని కొందరు చెబుతుండగా, మరికొందరు ఇది ప్రభుత్వ స్థలమేనని చెబుతున్నారు. ఏది ఏమైనా ఇక్కడ నెలకొన్న చెత్త సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



మల, మూత్ర విసర్జనతో దుర్వాసన

ఇక్కడి ఖాళీ స్థలంలో ఎవ్వరు పడితే వారు మల మూత్ర విసర్జన చేస్తుండడంతో పరిసరాల్లో దుర్వాసన వస్తోంది. ఈ ప్రాంతం నుంచి వెళ్లాలంటేనే ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధానంగా గోల్డెన్ కేవ్ రెస్టారెంట్‌కు మద్యం తాగేందుకు వచ్చే వారు మూత్ర విసర్జన చేస్తూ సిగరేట్లు తాగుతూ చెత్తలోకి విసురుతున్నారు. దీంతో నిప్పంటుకుని మంటలు ఎగిసి పడుతున్నాయి.

లింగంపల్లి - ఘట్‌కేసర్ మధ్య నేటి నుంచి ఎంఎంటీఎస్ సర్వీసు ప్రారంభం

ఖేల్‌కాలనీ/కుషాయిగూడ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నేడు నగరంలో లింగంపల్లి - ఘట్‌కేసర్‌ల మధ్య ఎంఎంటీఎస్ రైలు సేవలను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ప్రతిరోజూ తొమ్మిది బోగీలతో గల ఎంఎంటీఎస్ రైలు రెండు ట్రిప్పులు తిరిగే విధంగా ఏర్పాటు చేశారు. ప్రయాణికుల రద్దీ, డిమాండ్‌కు అనుగుణంగా రైలు ట్రిప్పులను పెంచుతామని దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారులు తెలిపారు.

ఎంఎంటీఎస్ సమయం వివరాలు..

ప్రారంభం సందర్భంగా మంగళవారం ఘట్‌కేసర్ నుంచి ఉదయం 10.45కి ఎంఎంటీఎస్ బయలుదేరి చర్లపల్లికి 10.59గంటలకు, నేరేడ్‌మెట్‌కు 11.21కి, అమ్ముగూడకి 11.29కి, భూదేవీనగర్‌కు 11.36కి, సుచిత్ర సెంటర్‌కు 11.45కి, ఫిరోజ్‌గూడ 11.54కు, భరత్‌నగర్ 12.03కు, బోరబండ 12.07కు, హైటెక్‌సిటీకి 12.12, హఫీజ్‌పేటకి 12.18, చందానగర్‌కి మధ్యాహ్నం 12.23, లింగంపల్లికి 12.40కి చేరుతుంది.

'శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి'

కీసర, మార్చి 4(ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించి ఈ నెల 6 నుంచి ఆరు రోజుల పాటు కీసరగుట్టపై జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని సోమవారం కీసరగుట్టలోని కల్యాణ మండపంలో ఆయా శాఖల అధికారులతో, ప్రజాప్రతినిధులతో, ఆలయ కమిటీ సభ్యులతో కలెక్టర్ గౌతమ్, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ దాదాపు 1800 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తులో పాల్గొంటారని, 56 సీసీ కెమెరాలతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఉచిత బస్సు సౌకర్యాంలో భాగంగా 300 బస్సులు జాతరకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి ముందు కలెక్టర్ గౌతమ్, ఆయా శాఖల అధికారులతో కలిసి కీసరగుట్ట క్షేత్రంపై కలియతిరిగారు.

అపోలో ఆస్పత్రిలో మహిళకు కార్-టీ సెల్ థెరపీ

హైదరాబాద్ సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అపోలో ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ రోగికి కార్ - టీ సెల్ థెరపీని నిర్వహించారు. కరీంనగర్‌కు చెందిన 50 ఏళ్ల మహిళా రోగి కొంతకాలంగా మల్టీపుల్ మైలోమా (బ్లడ్ కేన్సర్ కండిషన్)తో బాధపడుతున్నది. ఆమె ఇటీవల అపోలో కేన్సర్ సెంటర్ వైద్యుల వద్దకు రాగా, ఆమెకు వైద్య పరీక్షలు చేసి కేవలం కార్-టీ థెరపీ ద్వారానే చికిత్స అందించడానికి అవకాశముందని నిర్ధారించుకుని వైద్య ప్రక్రియను ప్రారంభించారు. చిమెరిక్ యాంటిజెన్ రిసెప్టర్ టీ-సెల్ (కార్-టీ) థెరపీని విజయవంతంగా నిర్వహించి కేన్సర్ చికిత్సలో అపోలో ఆస్పత్రి మరో మైలురాయిని చేరుకుందని అపోలో కేన్సర్ సెంటర్ హెమటాలజిస్ట్, బీఎంటీ స్పెషలిస్ట్ డాక్టర్ పద్మజ లోకిరెడ్డి చెప్పారు. అపోలో ఆస్పత్రుల జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ స్థాయి టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురావడంలో తమ ఆస్పత్రి ముందంజలో ఉంటున్నదన్నారు.

24వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలి: ఆర్.కృష్ణయ్య



ధర్నాలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య తదితరులు

కవాడిగూడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గణాంకాల ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 24వేల టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద తెలంగాణ బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో టెట్‌తోపాటు 24వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ సాధనకోసం మహాధర్నా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడారు. టెట్, డీఎస్సీ నోటిఫికేషన్లను ఒకేసారి వేయడానికి ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరాలు ఏమిటని ప్రశ్నించారు. ఇరవై సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న ఐదువేల ఆర్ట్, క్రాఫ్ట్, డ్రాయింగ్ టీచర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ టీచర్‌తోపాటు జూనియర్ అసిస్టెంట్ పోస్టులు కేటాయించి భర్తీ చేయాలన్నారు. బీసీ యువజన సంఘంరాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేష్ అధ్యక్షత జరిగిన ధర్నాలో బీసీ నేతలు గువ్వల భరత్, నందగోపాల్, రామకృష్ణ, నరసింహా గౌడ్, పోతులారం కృష్ణ, ప్రీతమ్, రాందేవ్, ఉదయ్, సతీష్, నిఖిల్, రఘుపతి, కరుణశ్రీ జయంతితోపాటు పెద్ద ఎత్తున నిరుద్యోగులు పాల్గొన్నారు.

'ల్యాబ్ టెక్నీషియన్స్ క్యాడర్‌కు వేతనాలు పెంచాలి'

హైదరాబాద్ సిటీ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వేతనాలను పెంచాలని కోరుతూ తెలంగాణ రెండో వేతన సవరణ కమిషన్ కమిషనర్ శివశంకర్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ల్యాబ్ టెక్నీషియన్స్ క్యాడర్‌కు గత వేతన సవరణల్లో జరిగిన అన్యాయాలపై పూర్తిస్థాయిలో విచారించి న్యాయం చేయాలని వేతనసవరణ కమిషన్‌ను కోరారు. ల్యాబ్ టెక్నీషియన్లకు వృత్తిపరంగా ఉన్న రిస్క్ ఫ్యాక్టర్స్ వల్ల కలిగే జీవితకాల ఆరోగ్య ప్రమాదాలకై, విద్య, వైద్యం కోసం ప్రత్యేక అలవెన్సు మంజూరీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు హరినాథ్, ప్రధాన కార్యదర్శి మంచాల రవీందర్, కోశాధికారి రాజేందర్, ఉపాధ్యక్షుడు మహ్మద్ సలీం, కార్యదర్శి రమేష్, బురాన్, వేణుగోపాల్, భాస్కర్, సునీత, ప్రకాష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మూడంతస్తుల మేడపైనుంచి పడి వృద్ధురాలి మృతి



శారద బెన్ (ఫైల్)

రాజేంద్రనగర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఉతికిన దుస్తులు ఆరేస్తూ మూడంతస్తుల మేడ పైనుంచి కిందపడి ఓ వృద్ధురాలు మృతిచెందింది. రాజేంద్రనగర్ సర్కిల్ భవానీ కాలనీలో ఇతీష్ కుమార్ కుటుంబం నివాసం ఉంటున్నది. సోమవారం ఇంట్లోని వారంతా పనుల నిమిత్తం బయటకు వెళ్లగా ఇతీష్‌కుమార్ తల్లి శారద బెన్(70) మూడంతస్తుల భవనంపై దుస్తులు ఆరవేస్తుండగా కళ్లు తిరిగి పై నుంచి కింద పడింది. మృతిచెందింది. శబ్దం రావడంతో నాలుగో అంతస్తులోని భావన పటేల్ బయటకు వచ్చి చూసి ఇతీష్ కుమార్‌కు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఇతీష్ రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్ఐ భాను ప్రకాశ్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

నగరంలో టానిక్ లిక్కర్స్ సెంటర్లలో వాణిజ్య పన్నుల శాఖ సోదాలు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న టానిక్ లిక్కర్స్ గ్రూప్‌నకు చెందిన షాపులు, వాటి అనుబంధ సంస్థలలో వాణిజ్య పన్నుల శాఖాధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం నుంచి రాత్రి 11గంటల వరకు కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీలతో పాటు నగరంలో సుమారు 10చోట్ల సోదాలు నిర్వహించారు. షాపుల్లో ఉన్న బ్రాండ్స్‌కు సంబంధించి కొనుగోలు వివరాలు.. ఎప్పుడు ఆర్డర్ ఇచ్చారు.. ఎక్కడి నుంచి సరఫరా అయింది? వాటికి సంబంధించిన లేబుల్స్ వివరాలను సేకరించారు. సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు వివరించిన తర్వాత తదుపరి చర్యలుంటాయని అధికారులు పేర్కొన్నారు.

విదేశాలకు తల వెంట్రుకలు ఎగుమతిలో అక్రమాలు

- ఈడీ ప్రాసిక్యూషన్ ఫిర్యాదును అనుమతించిన కోర్టు

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విదేశాలకు తల వెంట్రుకలు(జుట్టు) ఎగుమతి చేసి కోట్ల రూపాయలు అక్రమాలకు పాల్పడ్డ కేసులో ఈడీ దాఖలు చేసిన ప్రాసిక్యూషన్ ఫిర్యాదును కోర్టు అనుమతించింది. జుట్టు అక్రమ ఎగుమతులపై ఈడీ నైల ఫ్యామిలీ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్‌కు చెందిన 17 మందిపై మనీలాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఇందుకు సంబంధించిన ప్రాసిక్యూషన్ ఫిర్యాదును గత ఆగస్టు 21న నాంపల్లి పీఎంఎల్ఏ ప్రత్యేక న్యాయస్థానంలో దాఖలు చేసింది. ఈ ఫిర్యాదును కోర్టు ఇటీవలే అనుమతించినట్లు ఈడీ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మానవ వెంట్రుకలను మిజోరం వద్ద భూమార్గంలో మయన్మార్, చైనా, బంగ్లాదేశ్, వియత్నాంకు ఎగుమతి చేసినట్లు లభించిన ఆధారాల మేరకు హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. మనీలాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు చేపట్టింది. కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ పలు ప్రాంతాల్లో జరిపిన సోదాల్లో రూ. 1.21 కోట్లు లెక్కలోలేని నగదును స్వాధీనం చేసుకోవడంతో పాటు బ్యాంకు ఖాతాల్లోని రూ. 7.85 కోట్లు ఫ్రీజ్ చేసింది.

ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధనకు శ్రీకారం

- మంత్రి పొన్నం ప్రభాకర్



అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధనకు తమ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. మన బస్తీ మన బడి కార్యక్రమంలో భాగంగా సోమవారం అమీర్‌పేటకు విచ్చేసిన మంత్రి పొన్నం ముందుగా ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం బల్కంపేటలో రూ.16 లక్షలతో నిర్మించిన అంగన్ వాడీ భవనాన్ని ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి మంత్రి ప్రభాకర్ ప్రారంభించారు. అమీర్‌పేట హైస్కూల్‌కు చేరుకున్న పొన్నం ప్రభాకర్ ప్రైమరీ గర్ల్స్ స్కూల్‌లో మన బస్తీ మన బడి కార్యక్రమం ద్వారా రూ.52.25 లక్షలు, హైస్కూల్‌లో రూ.89.97లక్షలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సాంకేతికతను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. ఎమ్మెల్యే తలసాని మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు విద్యాబోధన జరగాలనే ఆలోచనతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ డీఈఓ రోహిణి, తలసాని సాయి కిరణ్, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, లలితా గోపీ చౌహాన్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, నవీన్ పాల్గొన్నారు.

'ముస్లిం గ్రేవ్‌యార్డ్ పనులు పూర్తి చేయాలి'

బేగంపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ముస్లిం గ్రేవ్‌యార్డ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం బేగంపేట ఓల్డ్ కస్టమ్స్ బస్తీలోని గ్రేవ్‌యార్డ్‌ను కార్పొరేటర్ టి.మహేశ్వరితో కలిసి సందర్శించి నూతనంగా నిర్మిస్తున్న భవనం, ప్రహరీ నిర్మాణం, ఇతర పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముస్లిం గ్రేవ్‌యార్డ్ కోసం 2 ఎకరాల భూమి కేటాయించడంతో పాటు నిర్మాణం కోసం రూ.2.95 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఇక్కడ రెండు గదులతో భవనం, గ్రేవ్‌యార్డ్‌కు ప్రహరీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు టి.శ్రీహరి, నరేందర్‌రావు, ఆరిఫ్, శ్రీనివాస్‌గౌడ్, శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

'వీరశైవ లింగాయత్‌లకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

ఖైరతాబాద్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వీరశైవ లింగాయత్, లింగ బలిజ కులస్తులకు బీసీ శాఖ తరపున ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కుల సంఘం పెద్దలు తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాజీ ఎంపీ సురేష్‌శెట్టి, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పటోళ్ల సంగమేష్ నేతృత్వంలో మంత్రికి మహాత్మా బసవేశ్వరుడి చిత్రపటం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర వీరశైవ లింగాయత్, లింగబలిజ సంఘం రాష్ట్ర ప్రతినిధులు బి.హనుమంతు, మల్లికార్జునప్ప, రాచప్ప, పృథ్విరాజ్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు



మాట్లాడుతున్న బాధితురాలు షేక్ అజీమున్నిసా బేగం

పంజాగుట్ట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): తన భర్త వివాహేతర సంబంధం కారణంగా తనను, పిల్లలను మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు పెడుతున్నాడని బాధితురాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో దుండిగల్‌కు చెందిన షేక్ అజీమున్నిసా బేగం తన గోడును వెల్లబోసుకుంది. 2002లో సోమ్మక్కపేటకు చెందిన ఎక్స్‌కవేటర్ మెకానిక్ షేక్ సాజిద్‌తో వివాహమైంది. ఒక కుమారుడు, కూతురు ఉన్నారని, వివాహేతర సంబంధం కారణంగా గడిచిన 12 సంవత్సరాలుగా తనను, పిల్లలను వేధిస్తున్నాడని, దుండిగల్ పీఎస్‌లో ఫిర్యాదు కూడా చేశానని ఆమె తెలిపారు. కేసు పెట్టినా ఫలితం లేకుం డా పోయిందని, న్యాయస్థానాన్ని ఆశ్రయించగా తనకు, ఇద్దరు పిల్లలకు ఒక్కొక్కరికి నెలకు ఐదు వేల రూపాయల చొప్పున మెయింటెనెన్స్ నిమిత్తం ఇవ్వాలని 2017 డిసెంబర్ 4న మేడ్చెల్ కోర్టు ఆదేశించిందని ఆమె తెలిపారు. న్యాయస్థానం ఆదేశాలను ధిక్కరించడంతో 2022 సెప్టెంబర్‌లో తన భర్తను దుండిగల్ పోలీసులు రిమాండ్ చేశారన్నారు. ఆస్తిలో పూర్తి భాగం ఇస్తానని కాగీ తం కూడా రాసిచ్చాడని, జైలు నుం చి బయటికి వచ్చిన తర్వాత వేధింపులు ఇంకా ఎక్కువయ్యాయని ఆమె తెలిపారు. తన జీవితం నాశనం కావడానికి 15మంది కారణమని, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుని, తనకు న్యాయం చేయాలని ఆమె ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసింది. లేకపోతే తనకు, పిల్లలకు ఆత్మహత్యే శరణ్యమన్నారు.

దివ్యాంగులకు అందిన పింఛన్



నరసింహ కుటుంబ సభ్యులకు పింఛన్ ప్రొసీడింగ్ లెటర్ అందజేస్తున్న తహసీల్దార్, ఆర్ఐ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యుసుఫ్‌గూడ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సంవత్సరాలుగా పింఛన్ కోసం ఎదురు చూస్తూ విసిగి వేసారిన దివ్యాంగులకు న్యాయం జరిగింది. 'ఆంధ్రజ్యోతి'లో 'దివ్యాంగులకు అందని ఆసరా' శీర్షికతో అధికారులు కదిలారు. దాదాపు పదేళ్లుగా పింఛన్ కోసం దరఖాస్తు చేయటం, పరిశీలనలో ఉందని అధికారులు చెప్పటం పరిపాటిగా మారిందని బాధితులు ఆవేదన చెందుతుండేవారు. ఈ నెల 3వ తేదీ 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి దృష్టికి చేరడంతో ఆయన ఆదేశాల మేరకు అధికారులు బాధితులకు పింఛన్ మంజూరు పత్రాలు అందజేశారు. ఇందులో బాగంగా సోమవారం ఖైరతాబాద్ తహసీల్దార్ నయీముద్దీన్, ఆర్ఐ విజయ్ కుమార్ యూసుఫ్‌గూడ లక్ష్మీనర్సింహానగర్‌లోని ఎం.నరసింహ నివాసానికి వెళ్లి కుటుం బ సభ్యులకు పింఛన్ ప్రొసీడింగ్ లెటర్ అందజేశారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తు న్న పింఛన్ అందటం చాలా సంతోషంగా ఉందని నరసింహ కుటుంబం సంతోషం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీ స్థలాన్ని కాపాడిన అధికారులు



అధికారులు ఏర్పాటు చేసిన సూచిక బోర్డు

బంజారాహిల్స్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ స్థలం కబ్జా శీర్షిక పేరిట 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 1న కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. స్థలంలో ప్రభుత్వ సూచిక బోర్డు ఏర్పాటు చేసి నిర్మాణాలు చేపట్టవద్దం టూ ప్రైవేట్ వ్యక్తులకు హెచ్చరించారు. ఫిలింనగర్ జ్ఞానీజైల్‌సింగ్ నగర్‌లో 200గజాల స్థలాన్ని అంగన్‌వాడీ కేంద్రం కోసం కేటాయించారు.ఈ స్థలంపై కన్నేసిన కబ్జా దారులు బయటి బస్తీలకు చెందిన పట్టా చూపించి స్థలాన్ని కొనుగోలు చేసినట్టు చెప్పుకుంటూ నిర్మాణాలు చేపట్టారు. ఈవి షయం 'ఆంధ్రజ్యోతి'లో రావడంతో రెవెన్యూ అధికారులు స్పందించి స్థలాన్ని రక్షించారు.

హెరిటేజ్ టవర్ నిర్మాణానికి రూ. 22 లక్షల విరాళం



హరే కృష్ణ మూవ్‌మెంట్ నిర్వాహకులకు చెక్కు అందజేస్తున్న నర్సింగ్ క్లాత్ ఎంపోరియం యజమాని

బంజారాహిల్స్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో నార్సింగ్ కోకాపేటలో రూపుదిద్దుకుంటున్న స్మారక సంస్కృతి, వారసత్వ ప్రాజెక్ట్ అయిన హరే కృష్ణ హెరిటేజ్ టవర్ నిర్మాణానికి నర్సింగ్ క్లాత్ ఎంపోరియం నిర్వాహకులు రూ. 22 లక్షలు విరాళం ప్రకటించారు. ఈ మేరకు బంజారాహిల్స్‌లోని హరే కృష్ణ మూవ్ మెంట్ కార్యాలయంలో సోమవారం సంస్థ అధ్యక్షుడు సత్యగౌరచంద్ర దాసకు నర్సింగ్ క్లాత్ ఎంపోరియం ఎండీ సంజయ్‌సింగానియా చెక్కును అందజేశారు. ఈసందర్భంగా సత్యగౌరచంద్రదాస మాట్లాడుతూ.. 400అడుగుల ఎత్తులో ఆరు ఎకరాల ప్రాంగణంలో హెరిటేజ్ టవర్‌ను నిర్మిస్తున్నట్టు చెప్పారు. రాధాకృష్ణ, శ్రీనివాస గోవింద్ దేవాలయాలతో గోశాలను కూడా ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. సంజయ్ సింగానియా మాట్లాడుతూ తమ కంపెనీ రూ. 270 కోట్ల ఆర్థిక టర్నోవర్‌ను అందుకుందన్నారు.

గత పీఆర్సీ కంటే మెరుగైన ఫిట్‌మెంట్ ఇవ్వాలి



రెండో పీఆర్సీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న బహుజన టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

పంజాగుట్ట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గత పీఆర్సీ కంటే మెరుగైన ఫిట్‌మెంట్ ఇవ్వాలని బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ)విజ్ఞప్తి చేసింది. అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం రెండో పీఆర్సీ కమిషన్ చైర్మన్ ఎన్.శివశంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కల్వదర్శి చైతన్య, గౌరవ అధ్యక్షులు వి.బాలపీర్ మాట్లాడుతూ గత పీఆర్సీ కంటే మెరుగైన ఫిట్‌మెంట్ ఇవ్వాలన్నారు. అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పి.చెన్నయ్య, కార్యదర్శి విజయ కుమార్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కె.రమేష్, తదితరులు ఉన్నారు.

శ్రీరామదూత ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న శ్రీరామదూత చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు

బంజారాహిల్స్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అవసరాల్లో ఉన్న పేదవారిని ఆదుకునేందుకు శ్రీరామదూత చారిటబుల్ ట్రస్టు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని వలంటీర్లు పేర్కొన్నారు. బంజారాహిల్స్ ఇండో అమెరికన్ బసవతారకం కేన్సర్ ఆస్పత్రివద్ద పేదల కోసం సోమవారం అన్నదానం చేశారు. ఈసందర్భంగా వలంటీర్లు కుమారస్వామి, శ్రీకాంత్ మాట్లాడుతూ.. ట్రస్టు ద్వారా ఉచిత వైద్య శిబిరాలు, అన్నదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కాళేశ్వర్ రెడ్డి, పాపారావు, సాయిజీరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సహాయం



బాధితులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు అరుణ్‌కుమార్, మహిపాల్‌రెడ్డి

బంజారాహిల్స్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితులకు బీజేపీ అండగా నిలిచింది. ఫిలింనగర్ పద్మాలయ అంబేద్కర్‌నగర్‌కు చెందిన చిన్నారెడ్డి ఇళ్లు గత వారం అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. దీంతో చిన్నారెడ్డి కుటుంబం రోడ్డు మీదకు వచ్చింది. సోమవారం బాధిత కుటుంబ సభ్యులను బీజేపీ నాయకులు గందే అరుణ్‌కుమార్, మహిపాల్‌రెడ్డి పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తరఫున కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు.

ప్రైవేటు స్థలంలో చొరబడిన బస్తీ వాసులు

బంజారాహిల్స్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ స్థలంలో చొరబడడమే కాకుండా అందులో గుడిసెలు వేసిన వారిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్‌రోడ్డు నెంబరు-5లో 550 గజాల స్థలాన్ని ఉమెన్స్ కో ఆపరేటివ్ సొసైటీ నుంచి 1991లో రవిశంకర్ కొనుగోలు చేశారు. అది ఖాళీ స్థలంగానే ఉంది. గతంలో కొంత మంది ఆక్రమించేందుకు ప్రయత్నించగా ఇటీవలె ప్రహరీ నిర్మించాడు. స్థలానికి సమీపంలో నివాసముండే దుర్గాభవానీనగర్‌కు చెందిన కొంత మంది ఈనెల 3న స్థలంలో అక్రమంగా ప్రవేశించారు. తాళం పగులకొట్టి లోపల గుడిసెలు వేసుకున్నారు. విషయం తెలుసుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు గుడిసెలను తొలగించాలని హెచ్చరించారు. బస్తీవాసులు వినిపించేకోలేదు. స్థల యజమాని రవిశంకర్ ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు బస్తీ వాసులపై కేసు నమోదు చేశారు.

రక్షించండి అంటూ ఆటోలో మహిళ అరుపులు

- వెంబడించిన విద్యార్థులు

బంజారాహిల్స్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రక్షించండి అంటూ ఓ మహిళ అరుపులు వినిపించడంతో ఆ విద్యార్థులు ఆమె ప్రయాణిస్తున్న కిలో మీటర్ వరకు వెంబడించారు. కాని ఆటో తప్పించుకుంది. మహిళ పక్కన ఉన్న వ్యక్తి ఆమె నోరు మూసివేయడం గమనించిన విద్యార్థులు అనుమానం వచ్చి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నగరానికి గుడిపాటి కృష్ణ బాచుపల్లిలో సీఎంఎస్ కాలేజీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 3న స్నేహితుడి సోదరుడి వివాహానికి వెళ్లాడు. అనంతరం మరో స్నేహితుడు సుమన్ ద్విచక్ర వాహనంపై ఎస్ఎఫ్‌సీఎల్ నుంచి కేబీఆర్ పార్కు వైపు వెళ్తుండగా ఓ ఆటో వారి పక్క నుంచి వెళ్లింది. అందులో ఉన్న మహిళ రక్షించండి అంటూ అరిచింది. ఆటో వెనుకాలే ద్విచక్ర వాహనం వస్తున్న వ్యక్తి ఆదేశాల మేరకు ఆటోలో ఉన్న వ్యక్తి నోరు చేతితో మూసి వేశాడు. గమనించిన విద్యార్థులు ఆటోను వెంబడించారు. కాని పట్టుకోలేకపోయారు. దీంతో వారు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కిడ్నాప్ కేసుగా నమోదు చేసుకొని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.



- ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన హేమంత్ సోమవారం నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సమస్యలపై చర్చించారు.

\- బంజారాహిల్స్, మార్చి 4(ఆంధ్రజ్యోతి)

'ఉషు'లో జేఎన్‌టీయూ విద్యార్థినికి కాంస్యం

హైదరాబాద్ సిటీ, మార్చి4 (ఆంధ్రజ్యోతి): చైనీస్ మార్షల్ ఆర్ట్స్ 'ఉషు' జాతీయ స్థాయి చాంపియన్ షిప్‌లో జేఎన్‌టీయూ విద్యార్థిని పొడగంటి పవిత్ర కాంస్య పతకం కైవసం చేసుకుంది. ఖమ్మం జిల్లాకు చెందిన పొడగంటి పవిత్ర ప్రస్తుతం సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఇటీవల జమ్మూ యూనివర్సిటీలో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ 'ఉషు' పోటీలో కాంస్య పతకం గెలుపొందింది. అలాగే గత నెలలో జార్ఖండ్‌లో జరిగిన ఫెడరేషన్ కప్ పోటీల్లో పవిత్ర ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించింది. పవిత్రను సోమవారం వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కట్టా నర్సింహారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ సెక్రటరీ దిలీప్, కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మామూళ్ల కోసం గొడవ

ఎర్రగడ్డ రైతు బజార్ వద్ద కత్తిపోట్లు

బోరబండ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మామూళ్లు అడిగేందుకు వచ్చిన పళ్ల వ్యాపారి మీద ఇతర వ్యాపారులు దాడికి పాల్పడ్డారు. మహమ్మద్ నబి అనే వ్యక్తి మామూళ్ల కోసం తోటి వ్యాపారులను వేధిస్తుంటాడని.. గతంలో కూడా మామూలు ఇవ్వాలని బెదిరించినట్లు వ్యాపారులు ఫిర్యాదులో పోలీసులకు తెలిపారు. అతను పండ్ల వ్యాపారుల వద్దకు వెళ్లి బెదిరింపులకు పాల్పడుతూ అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని గతంలో బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. ఆదివారం అర్ధరాత్రి కూడా డబ్బులు ఇవ్వాలని అడిగిన పండ్ల వ్యాపారి మీద తోటి వ్యాపారులు కత్తితో దాడి చేశారు. అడ్డుకోదానికి ప్రయత్నించిన మరో ఇద్దరి వ్యక్తులకు గాయాలయ్యాయి. బోరబండ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బోరబండ ఇన్‌స్పెక్టర్‌గా శేఖర్

బోరబండ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): బోరబండ ఎస్‌హెచ్‌ఓగా ఎస్‌వి శేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జూబ్లీహిల్స్‌లో డీఐగా పని చేసిన శేఖర్ బోరబండ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. గతంలో బోరబండలో పని చేసిన ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి ఫలక్‌నుమాకు బదిలీపై వెళ్లారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

చందానగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి, 745 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చందానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాపిరెడ్డికాలనీకి చెందిన రాజేష్ ఆంధ్రప్రదేశ్ అరకు నుంచి గంజాయి తీసుకొచ్చి ఇంటిలోనే విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు ఎస్సై రఘు ఆధ్వర్యంలో దాడులు చేసి అతడిని అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సూపరింటెండెంట్‌కు మెమోరాండం సమర్పిస్తున్న నర్సింహ

ఔట్‌సోర్సింగ్ నర్సింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి

● ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నర్సింహ

అడ్డగుట్ట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : గాంధీ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ మెడికల్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నర్సింహ సోమవారం గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న నర్సింగ్ సిబ్బందికి ప్రతి నెలా జీతాలు చెల్లించడంతో పాటు పీఎఫ్‌లు చెల్లించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కాంట్రాక్టర్ లేకుండా ప్రభుత్వం ద్వారా జీతాలు చెల్లించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. సూపరింటెండెంట్‌ను కలిసినవారిలో సంఘం ప్రతినిధులు నాగమణి, రాజేశ్వరి, పుణ్యమ్మ, కవిత, కోటేశ్వరి, అనసూయ పాల్గొన్నారు.



జోషి కాంపౌండ్‌లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ సామల హేమ

జోషి కాంపౌండ్‌లో కార్పొరేటర్ పర్యటన

బౌద్ధనగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్‌లో జోషి కాంపౌండ్‌లో సోమవారం అధికారులతో కలిసి కార్పొరేటర్ సామల హేమ పర్యటించారు. స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పురాతన సివరేజీ పైపులైన్‌లను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో మంచినీటి సమస్య ఉందని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. తనదృష్టికి తీసుకువచ్చిన సమస్యలను ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు. జలమండలి ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్, పాఠశాల ఇన్‌చార్జి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జాయింట్ కన్వీనర్‌గా మహేష్

చిలకలగూడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గం, బీజేపీ జాయింట్ కన్వీనర్‌గా ఎస్.మహేష్‌ని నియమిస్తు ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికార ప్రతినిధి శారదా మల్లేష్ తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో మహేష్‌ని శాలువాతో సత్కరించి పార్టీ పటిష్టతకి కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకి వివరించాలని కోరారు. బీజేపీ నాయకులు శ్యామ్‌సుందర్‌గౌడ్, మల్లేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

దీపక్‌జాన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకుడు రాంలీల

అడ్డగుట్ట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ చైర్మన్‌గా నియమితులైన దీపక్ జాన్‌ను సోమవారం సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు రాంలీల మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. దీపక్ జాన్ కరోనా సమయంలో సికింద్రాబాద్ ప్రజలకు సేవా కార్యక్రమాలతోపాటు నిరుపేదలకు నిత్యావసర వస్తువులు వితరణ చేసిన ఘనత దీపక్ జాన్‌కు దక్కుతుందని ఆమె తెలిపారు. కష్ట కాలంలో పని చేసిన వారికి కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు ఉంటుందని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు.



కంటోన్మెంట్ బోర్డు ఆవరణలో ఆందోళన చేస్తున్న సీపీఐ (ఎం) నాయకులు

బోర్‌వెల్స్‌కు నీటి మీటర్ల ఏర్పాటు ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి

సీపీఐ(ఎం) నాయకుడు శ్రీనివాస్

సికింద్రాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో బోర్‌వెల్స్‌కు నీటి మీటర్లు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎం)నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం ఆవరణలో వారు ఆందోళన నిర్వహించారు. అనంతరం సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు కె.ఎస్.రాజన్న, కంటోన్మెంట్ జోన్ కన్వీనర్ నారాయణ మాట్లాడుతూ కంటోన్మెంట్ బోర్డు తీసుకున్న నిర్ణయం సామాన్య, పేద ప్రజలకు గుదిబండగా మారుతుందన్నారు. వాడుతున్న బోరు నీళ్లకు కిలో లీటర్‌కు 3రూపాయల చొప్పున బోర్డుకు చెల్లించాలని, నీటి మీటర్లు పనిచేయకపోతే 5వేల రూపాయలు జరిమాన వసూలు చేస్తామని మార్గదర్శకాలు జారీ చేయడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు.

కుటుంబ గొడవలతో రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కుటుంబ గొడవల కారణంగా ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మౌలాలి రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. సంగారెడ్డి జిల్లా అల్లాదుర్గ్ ప్రాంతానికి చెందిన శివకుమార్ (27)కు రెండేళ్ల క్రితం శైలజతో వివాహం జరిగింది. నాటినుంచి భార్యాభర్తల మధ్య గొడవలు, కుటుంబ కలహాలు ఉన్నాయి. అయితే, కొద్ది రోజుల క్రితం ఉపాధి నిమిత్తం నగరానికి వలసవచ్చి మల్లాపూర్‌లో అద్దెకు దిగారు. ఇటీవల కూడా భార్యాభర్తల గొడవలు తలెత్తడంతో తీవ్ర మనస్తాపానికి గురైన శివకుమార్ చర్లపల్లి - మౌలాలి రైల్వే స్టేషన్ మార్గ మధ్యలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపారు.

త్వరలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు

● మంత్రి పొన్నం ప్రభాకర్

పద్మారావునగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : అర్హత కలిగిన పేదలకు త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లను అందిస్తామని రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి గొల్లకొమురయ్య కాలనీలో నూతన అంగన్‌వాడీ కేంద్రాన్ని మంత్రి, రాజ్యసభ సభ్యులు ఎం.అనీల్ కుమార్, హైదరాబాద్ నగర మేయర్ మోతె శ్రీలతా శోభన్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిలతో కలసి ప్రారంభించారు.

అనంతరం స్థానిక కార్పొరేటర్ కుర్మ హేమలత, జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు, చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సునందలతో కలసి అంగన్‌వాడి కేంద్రాన్ని పరిశీలించి, వివరాలను తెలుసుకొన్నారు. స్థానిక బస్తీ మహిళలను పలకరించి, ఉచిత బస్సులలో ప్రయాణిస్తున్నారా అని అడిగారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రెండు వందల అదనపు బస్సులను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. స్వంత ఇళ్ల కోసం మంత్రిని మహిళలు అడగగా త్వరలోనే అర్హత కలిగిన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను ఇస్తామని తెలియజేశారు.

ఈ సందర్భంగా ఎస్సీ కులాల హక్కుల పరిరక్షణ సమితి డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హరిప్రియ, అంగన్‌వాడీ టీచర్ రూత, అటెండర్ పద్మమ్మ, స్థానిక నాయకులు కే.ఎం.కృష్ణ, నర్సింగరావు, రాపాక అశోక్, కుర్మ మహేందర్, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.



బోయిగూడ గొల్ల కొమరయ్య కాలనీలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

నేడు కంటోన్మెంట్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం

సికింద్రాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో మంగళవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో పలు అభివృద్ధి పనులకు, సంక్షేమ పథకాల అమలుకు శ్రీకారం చుట్టనున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకురాలు వెన్నెల, నాయకుడు మర్రి అమరేందర్‌రెడ్డిలు సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు అండగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారని తెలిపారు. జీతాలు కూడా చెల్లించడానికి అవస్థలు పడుతున్న కంటోన్మెంట్ బోర్డుకు 48 కోట్ల రూపాయల టీపీటీ చార్జీల బకాయిలు చెల్లించిన రేవంత్‌రెడ్డి కంటోన్మెంట్ అభివృద్ధికి మరిన్ని చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. దీనిలో భాగంగా మడ్‌ఫోర్టు దోబీఘాట్‌లో 80లక్షల 14వేల రూపాయిల నిధులతో మోడర్న్ మెకనైజ్డ్ లాండ్రీ యూనిట్ ఏర్పాటు చేశారని చెప్పారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఈ యూనిట్‌ను ప్రారంభించనున్నారని తెలిపారు. కంటోన్మెంట్ అభివృద్ధికి సహకరిస్తున్నందుకు రేవంత్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.



పోస్టర్ విడుదల చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

8న హాండ్లూమ్ ఎగ్జిబిషన్ ప్రారంభం

తిరుమలగిరి మార్చ్ 4 (ఆంధ్రజ్యోతి) : బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఈనెల 8 నుంచి 10వ తేది వరకు హాండ్లూమ్ ఎగ్జిబిషన్ ప్రారంభం అవుతుందని రాష్ట్రపతి నిలయం పరిపాలన అధికారి రజనీప్రియ తెలిపారు. సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పోస్టర్ విడుదల చేశారని ఆమె తెలిపారు

సర్దార్ సర్వాయి పాపన్న చరిత్రను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయి

● జైగౌడ్ ఉద్యమం కమిటీ జాతీయ అధ్యక్షుడు డా. వట్టికూటి రామారావు గౌడ్

తార్నాక, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : సర్దార్ సర్వాయి పాపన్న చరిత్రను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని జైగౌడ్ ఉద్యమం కమిటీ జాతీయ అధ్యక్షుడు డా.వట్టికూటి రామారావుగౌడ్ అన్నారు. సోమవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీలో జైగౌడ్ ఉద్యమం జాతీయ కమిటీ సభ్యుల సమావేశాన్ని ఏర్పాటు చేసి ఏడు రాష్ట్రాలకు నూతన కమిటీలను ఎన్నుకున్నారు. జైగౌడ్ ఉద్యమ ఏపీ అధ్యక్షుడిగా చిట్టిబొమ్మ కిషోర్‌గౌడ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా గంద్రాతి నారాయణగౌడ్, మహారాష్ట్ర అధ్యక్షుడిగా నారాయణగౌడ్, చత్తీస్‌ఘడ్ అధ్యక్షుడిగా దీపక్ గౌడ్ జైస్వాల్, మధ్యప్రదేశ్ అధ్యక్షుడిగా రంగనాథ్ గౌడ్‌ను ఎన్నుకున్నారు.



ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో అభివాదం చేస్తున్న జైగౌడ్ ఉద్యమం జాతీయ కమిటీ సభ్యులు

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పుస్తకాలు పంపిణీ

అడ్డగుట్ట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : శంకేశ్వర బజారులోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న టెన్త్ విద్యార్థులకు పరీక్షల ప్యాడ్‌తో పాటు ఆల్ ఇన్ వన్ గైడ్ పుస్తకాలను దాదాపు 40 మంది విద్యార్థులకు సెవెన్‌రేస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ డాక్టర్ సారా చేతుల మీదుగా ఉచితంగా అందజేశారు. ఆల్ ఇన్ వన్ గైడ్ బుక్‌లు కొనే స్థోమత లేకపోవడంతోనే సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా ఆల్ ఇన్ వన్ గైడ్ పుస్తకాలను అందజేశానని చెప్పారు.



విద్యార్థులతో డాక్టర్ సారా

బైక్ అదుపుతప్పి .. కారును ఢీకొని..

బాలుడు మృతి, మరో బాలుడికి తీవ్ర గాయాలు

బోయిన్‌పల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన పార్కింగ్ చేసివున్న బొలెరో కారును ఓ విద్యార్థి నడిపిస్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి ఢీ కొట్టింది. ఈ ఘటనలో వాహనం నడిపిస్తున్న విద్యార్థి చికిత్స పొందుతూ మృతి చెందగా, వెనకాల కూర్చున్న మరో విద్యార్థికి తీవ్ర గాయాలు అయిన సంఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం ఓల్డ్ బోయిన్‌పల్లి ఆర్‌ఆర్ నగర్ ప్రాంతానికి చెందిన ఖాజా కుమరుడు షేక్ మహ్మద్ హుస్సేన్ (14) ఓ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఓల్డ్ బోయిన్‌పల్లి బడగూడకు చెందిన మొహమ్మద్‌గౌస్ కుమారుడు మహ్మద్ సమీర్ (15) ఓ ప్రైవేట్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. షేక్ మహ్మద్ హుస్సేన్, మహ్మద్ సమీర్‌లు మంచి స్నేహితులు, బంధువులు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం షేక్ మహ్మద్ హుస్సేన్ తన తండ్రి బజాజ్ బైక్ టి.ఎస్.10ఇహెచ్1175 బైక్‌పై మహ్మద్ సమీర్ వద్దకు వచ్చి ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌కు వెళ్ళి ఏదైనా తినివద్దామని చెప్పాడు. దీంతో షేక్ మహ్మద్ హుస్సేన్, మహ్మద్ సమీర్‌లు కలిసి బైక్‌పైన హస్మత్‌పేట్ వైపు ఉన్న ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో వారు వైష్ణవిమాత దేవాలయం వద్దకు చేరుకోగానే తమ వద్ద డబ్బులు లేవు అని, తీసుకురావడం మరిచిపోయామని గ్రహించిన వారు ఇంటికి వెళ్ళి డబ్బులు తీసుకురావడం కోసం అదే బైక్‌పైన వేగంగా తిరుగుప్రయాణం అయ్యారు. ఈ క్రమంలో వారు నడిపిస్తున్న బైక్ ఓల్డ్ బోయిన్‌పల్లి వద్ద ఉన్న హైదరాబాద్ ఫుడ్ కోర్ట్ సమీపంలో అదుపుతప్పింది. దీంతో అదుపుతప్పిన బైక్ రోడ్డు పక్కనే పార్కింగ్ చేసివున్న టీఎస్12యుఎ6673 నెంబర్ గల బొలెరో కారును బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో రోడ్డుపైన పడిపోయిన షేక్ మహ్మద్ హుస్సేన్ తలకు తీవ్ర గాయాలు అయి అపస్మారక స్థితికి వెళ్ళాడు. కాగా మహ్మద్ సమీర్‌కు తీవ్ర గాయాలు కావడం జరిగింది. దీంతో మహ్మద్ సమీర్‌ను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న షేక్ మహ్మద్ హుస్సేన్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న షేక్ మహ్మద్ హుస్సేన్ ఆదివారం మృతి చెందినట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. దీంతో ప్రస్తుతం చికిత్స పొందుతున్న మహ్మద్‌సమీర్ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దివంగత ఎమ్మెల్యే లాస్యనందితకు ఘన నివాళి

మారేడ్‌పల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): దివంగత ఎమ్మెల్యే లాస్యనందిత దశదినకర్మ కార్యక్రమం సోమవారం కంటోన్మెంట్ నియోజకవర్గంలోని కార్ఖానా గృహలక్ష్మి కాలనీలోని ఆమె నివాసంలో జరిగింది. పలువురు నేతలు, ప్రముఖులు దివంగత ఎమ్మెల్యే లాస్యనందితకు ఘన నివాళి అర్పించారు. ఈ దశదిన కర్మకు కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, అనితా ప్రభాకర్, నళిని కిరణ్, పాండు యాదవ్, లోకనాథం, బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్‌తో పాటు పలు వార్డుల బీఆర్‌ఎస్ అధ్యక్షులు, ఉద్యమకారులు, మహిళా నేతలు, యువ నాయకులు, స్థానిక ప్రజలు హాజరయ్యారు.



లాస్యనందిత దశదిన కర్మకు హాజరైన నేతలు, ప్రముఖులు

లాస్యనందిత కుటుంబ సభ్యుల ఏకగ్రీవానికి ప్రతిపక్షాలు సహకరించాలి

సికింద్రాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యురాలు లాస్యనందిత మృతితో ఏర్పడిన ఖాళీని ఆమె కుటుంబ సభ్యులతో భర్తీ చేయాలని కుటుంబ సభ్యుల్లో ఒకరు ఏకగ్రీవంగా ఎన్నిక కావడానికి ప్రతిపక్షాలు సహకరించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఎం.ఎన్.శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వరుస ఘటనలతో దిగ్భ్రాంతికి గురైన సాయన్న కుటుంబానికి ప్రతి ఒక్కరూ అండగా ఉండవలసిన ఆవశ్యకత ఉందని ఎం.ఎన్.శ్రీనివాస్ అన్నారు. అలాగే లాస్యనందిత కుటుంబ సభ్యుల్లో ఒకరిని అసెంబ్లీకి ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు కాంగ్రెస్, బీజేపీలు సహకరించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీజేపీ అగ్రనేతలు ఈ అంశాన్ని పరిశీలించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



ఎం.ఎన్.శ్రీనివాస్

వైశ్యులకు అండగా ఉంటా : కందుకూరి శ్రీనివాస్

అడ్డగుట్ట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నిరుపేద వైశ్యులకు అండగా ఉంటానని ఇంటర్ నేషనల్ వైశ్యఫెడరేషన్ సికింద్రాబాద్ ప్రధాన కార్యదర్శి కందుకూరి శ్రీనివాస్ అన్నారు. అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నిరుపేద వైశ్యులను ఆదుకోవడమే కాదు ప్రభుత్వపరంగా కానీ వైశ్య అసోసియేషన్ పరంగా కానీ నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందేవిధంగా చూస్తానన్నారు. తనకు పదవీ బాధ్యతలను అప్పగించిన సంస్థ జాతీయ జనరల్ కమిటీ చైర్మన్ గంజిరామమౌళిగుప్త, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌లకు అభినందనలు తెలిపారు.



నియామక పత్రాన్ని అందుకుంటున్న కందుకూరి శ్రీనివాస్

భారీ వాహనాలపై కేసు నమోదు

● ఇన్‌స్పెక్టర్ మధు బాబు

తిరుమలగిరి మార్చ్ 4 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నియమ నిబంధనలు ఉల్లంఘిస్తున్న భారీ వాహనాలపై తిరుమలగిరి ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ మధుబాబు తెలిపిన వివరాల ప్రకారం నిషేధాజ్ఞలు ఉల్లంగించి హైదరాబాద్ సిటీలోకి ఎంట్రీ ఇచ్చిన నాలుగు భారీ వాహనాలను పట్టుకుని బొల్లారం పోలీస్ స్టేషన్‌కి తరలించి, ఇట్టి వాహనదారులపై చట్టపరమైన కేసులు నమెదు చేయడమైనది. నిషేధాజ్ఞలు ఉల్లంగించి హైదరాబాద్‌లోకి వచ్చినట్లైతే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మధుబాబు తెలిపారు. భారీ వాహనములు కేవలం రాత్రి 11 నుంచి ఉదయం 7గంటల వరకు మాత్రమే అనుమతి కలదు అని అన్నారు.

ఓటరు నమోదు ప్రక్రియ సాఫీగా జరగడానికి సహకరించాలి

సికింద్రాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటరు నమోదు ప్రక్రియ సాఫీగా, సమర్థవంతంగా జరగడానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని సికింద్రాబాద్ ఈఆర్‌ఓ, జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ ఉపకమిషనర్ డి.సుభాష్‌రావు విజ్ఞప్తి చేశారు. సోమవారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ఓటరు నమోదు ప్రక్రియకు సహకరించాలని కోరారు. ఓటర్లకు ఇబ్బంది కలగని రీతిలో పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు జరుగుతుందని తెలిపారు.

ఎలాంటి అభ్యంతరాలకైనా ఓటర్లు సకాలంలో ముందుకు రావాలని సూచించారు. ఏఈఆర్‌ఓ హేమలత, డీటీ ఎన్.భార్గవీదేవి, సెక్షన్ ఇన్‌చార్జి భుజేందర్ బాబు, పవన్‌కుమార్, జనార్ధన్, వివిధ పార్టీల నాయకులు ప్రవీణ్, రాజసుందర్, జలంధర్‌రెడ్డి, ప్రకాష్ గౌడ్, శ్యామ్, నర్సింగ్‌రావు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూమి కబ్జాపై విచారణ

తిరుమలగిరి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో తిరుమలగిరి లాల్‌బజార్‌లో ఉన్న మహంకాళి దేవాలయం ప్రాంగణంలో భూమి కబ్జా అవుతుందని, అసలు వాస్తవాలు తెలుసుకునేందుకుగాను దేవాదాయ శాఖ విభాగం అధికారులు దర్యాప్తులో భాగంగా సోమవారం భక్తుల అభిప్రాయాలు తెలుసుకుని పరిస్థితులను అధ్యయనం చేసేందుకు విచ్చేశారు. ఎండోమెంట్ విభాగం అసిస్టెంట్ కమిషనర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో పలువురు అధికారులు దేవాలయానికి విచ్చేసి పరిశీలించారు.

దేవాలయం పక్కనే ఉన్న 20 గుంటల భూమిని ఒక వ్యక్తి కబ్జా చేశాడని గత కొంతకాలంగా భక్తులు ఆందోళన చేస్తున్నారు. కాగా ఎండోమెంట్ అధికారులు ఇరువర్గాల వాదాలను విన్నారు. సదరు వ్యక్తులు భూమిని కొన్నామని ఎండోమెంట్‌కు సంబంధం లేదని సంబంధిత ఆధారాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నామని, మేము హక్కుదారులమని ఎండోమెంట్ అధికారులకు వివరణ ఇచ్చి సంబంధిత డాక్యుమెంట్స్ అందజేశారు. ఈ విషయం భక్తుల వాదలను కూడా విన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ దేవాలయానికి అనుబంధంగా దాతలు భూమిని ఇచ్చారని, అలాంటి భూమిని కాపాడవలసిన నాయకులు భూమిని కబ్జా చేశారని భక్తులు ఎండోమెంట్ అధికారులకు తెలిపారు. ఇరువర్గాల వాదనలు, వాస్తవాలను పరిశీలించి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇరువర్గాల వాదనలను విన్న తాము డాక్యుమెంట్స్ పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకుంటామని ఎండోమెంట్ అధికారులు విలేకరులకు వివరించారు. ఎండోమెంట్ భూమి అయితే రక్షిస్తామని, పట్టాదారులు యజమానులు అయితే తమకు సంబంధం లేదని వారు వివరించారు. ఈ సందర్భంగా ఈఓ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ దేవాలయానికి సంబంధించిన భూమి అయితే కాపాడుతామని అమ్మవారి సాక్షిగా తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని కబ్జాదారులను సహించేది లేదని అన్నారు. దేవాదాయ శాఖ ఎంఆర్‌ఓ విజయలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ ఆండాలు, మోహన్ రెడ్డి, స్థానిక భక్తులు పాల్గొన్నారు



స్థానికులతో మాట్లాడుతున్న ఏసీ సంధ్యారాణి

లింగంపల్లి - ఘట్‌కేసర్ మధ్య నేటి నుంచి ఎంఎంటీఎస్ సర్వీసు ప్రారంభం

ఖైల్‌కాలనీ/కుషాయిగూడ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నేడు నగరంలో లింగంపల్లి - ఘట్‌కేసర్‌ల మధ్య ఎంఎంటీఎస్ రైలు సేవలను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ప్రతిరోజూ తొమ్మిది బోగీలతో గల ఎంఎంటీఎస్ రైలు రెండు ట్రిప్పులు తిరిగే విధంగా ఏర్పాటు చేశారు. ప్రయాణికుల రద్దీ, డిమాండ్‌కు అనుగుణంగా రైలు ట్రిప్పులను పెంచుతామని దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారులు తెలిపారు.

ఎంఎంటీఎస్ సమయం వివరాలు..

ప్రారంభం సందర్భంగా మంగళవారం ఘట్‌కేసర్ నుంచి ఉదయం 10.45కి ఎంఎంటీఎస్ బయలుదేరి చర్లపల్లికి 10.59గంటలకు, నేరేడ్‌మెట్‌కు 11.21కి, అమ్ముగూడకి 11.29కి, భూదేవీనగర్‌కు 11.36కి, సుచిత్ర సెంటర్‌కు 11.45కి, ఫిరోజ్‌గూడ 11.54కు, భరత్‌నగర్ 12.03కు, బోరబండ 12.07కు, హైటెక్‌సిటీకి 12.12, హఫీజ్‌పేట్‌కి 12.18, చందానగర్‌కి మధ్యాహ్నం 12.23, లింగంపల్లికి 12.40కి చేరుతుంది.

'శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి'

కీసర, మార్చి 4(ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించి ఈనెల 6 నుంచి ఆరు రోజుల పాటు కీసరగుట్టపై జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని సోమవారం కీసరగుట్టలోని కల్యాణ మండపంలో ఆయా శాఖల అధికారులతో, ప్రజాప్రతినిధులతో, ఆలయ కమిటీ సభ్యులతో కలెక్టర్ గౌతమ్, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ దాదాపు 1800 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తులో పాల్గొంటారని, 56 సీసీ కెమెరాలతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఉచిత బస్సు సౌకర్యంలో భాగంగా 300 బస్సులు జాతరకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి ముందు కలెక్టర్ గౌతమ్, ఆయా శాఖల అధికారులతో కలిసి కీసరగుట్ట క్షేత్రంపై కలియతిరిగారు.

అపోలో ఆస్పత్రిలో మహిళకు కార్-టీ సెల్ థెరపీ

హైదరాబాద్ సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అపోలో ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ రోగికి కార్ - టీ సెల్ థెరపీని నిర్వహించారు. కరీంనగర్‌కు చెందిన 50 ఏళ్ల మహిళా రోగి కొంతకాలంగా మల్టీపుల్ మైలోమా (బ్లడ్ కేన్సర్ కండిషన్)తో బాధపడుతున్నది. ఆమె ఇటీవల అపోలో కేన్సర్ సెంటర్ వైద్యుల వద్దకు రాగా, ఆమెకు వైద్య పరీక్షలు చేసి కేవలం కార్-టీ థెరపీ ద్వారానే చికిత్స అందించడానికి అవకాశముందని నిర్ధారించుకుని వైద్య ప్రక్రియను ప్రారంభించారు. చిమెరిక్ యాంటిజెన్ రిసెప్టర్ టీ-సెల్ (కార్-టీ) థెరపీని విజయవంతంగా నిర్వహించి కేన్సర్ చికిత్సలో అపోలో ఆస్పత్రి మరో మైలురాయిని చేరుకుందని అపోలో కేన్సర్ సెంటర్ హెమటాలజిస్ట్, బీఎంటీ స్పెషలిస్ట్ డాక్టర్ పద్మజ లోకిరెడ్డి చెప్పారు. అపోలో ఆస్పత్రుల జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ స్థాయి టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురావడంలో తమ ఆస్పత్రి ముందంజలో ఉంటున్నదన్నారు.

24వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలి : ఆర్.కృష్ణయ్య

కవాడిగూడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గణాంకాల ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 24వేల టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద తెలంగాణ బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో టెట్‌తోపాటు 24వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ సాధనకోసం మహాధర్నా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడారు. టెట్, డీఎస్సీ నోటిఫికేషన్లను ఒకేసారి వేయడానికి ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరాలు ఏమిటని ప్రశ్నించారు. ఇరవై సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న ఐదువేల ఆర్ట్, క్రాఫ్ట్, డ్రాయింగ్ టీచర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ టీచర్‌తోపాటు జూనియర్ అసిస్టెంట్ పోస్టులు కేటాయించి భర్తీ చేయాలన్నారు. బీసీ యువజన సంఘంరాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేష్ అధ్యక్షత జరిగిన ధర్నాలో బీసీ నేతలు గువ్వల భరత్, నందగోపాల్, రామకృష్ణ, నరసింహాగౌడ్, పోతులారం కృష్ణ, ప్రీతమ్, రాందేవ్, ఉదయ్, సతీష్, నిఖిల్, రఘుపతి, కరుణశ్రీ జయంతితోపాటు పెద్ద ఎత్తున నిరుద్యోగులు పాల్గొన్నారు.



ధర్నాలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య తదితరులు

'ల్యాబ్ టెక్నీషియన్స్ క్యాడర్‌కు వేతనాలు పెంచాలి'

హైదరాబాద్ సిటీ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వేతనాలను పెంచాలని కోరుతూ తెలంగాణ రెండో వేతన సవరణ కమిషన్ కమిషనర్ శివశంకర్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ల్యాబ్ టెక్నీషియన్స్ క్యాడర్‌కు గత వేతన సవరణల్లో జరిగిన అన్యాయాలపై పూర్తిస్థాయిలో విచారించి న్యాయం చేయాలని వేతనసవరణ కమిషన్‌ను కోరారు. ల్యాబ్ టెక్నీషియన్లకు వృత్తిపరంగా ఉన్న రిస్క్ ఫ్యాక్టర్స్ వల్ల కలిగే జీవితకాల ఆరోగ్య ప్రమాదాలకై, విద్య, వైద్యం కోసం ప్రత్యేక అలవెన్సు మంజూరీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు హరినాథ్, ప్రధాన కార్యదర్శి మంచాల రవీందర్, కోశాధికారి రాజేందర్, ఉపాధ్యక్షుడు మహ్మద్ సలీం, కార్యదర్శి రమేష్, బురాన్, వేణుగోపాల్, భాస్కర్, సునీత, ప్రకాష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మూడంతస్తుల మేడపైనుంచి పడి వృద్ధురాలి మృతి

రాజేంద్రనగర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఉతికిన దుస్తులు ఆరేస్తూ మూడంతస్తుల మేడ పైనుంచి కిందపడి ఓ వృద్ధురాలు మృతిచెందింది. రాజేంద్రనగర్ సర్కిల్ భవానీ కాలనీలో ఇతీష్‌కుమార్ కుటుంబం నివాసం ఉంటున్నది. సోమవారం ఇంట్లోని వారంతా పనుల నిమిత్తం బయటకు వెళ్లగా ఇతీష్‌కుమార్ తల్లి శారద బెన్(70) మూడంతస్తుల భవనంపై దుస్తులు ఆరవేస్తుండగా కళ్లు తిరిగి పై నుంచి కింద పడి మృతిచెందింది. శబ్దం రావడంతో నాలుగో అంతస్తులోని భావన పటేల్ బయటకు వచ్చి చూసి ఇతీష్ కుమార్‌కు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఇతీష్ రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్‌ఐ భానుప్రకాశ్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.



శారద బెన్ (ఫైల్)

నగరంలో టానిక్ లిక్కర్స్ సెంటర్లలో వాణిజ్య పన్నుల శాఖ సోదాలు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న టానిక్ లిక్కర్స్ గ్రూప్‌నకు చెందిన షాపులు, వాటి అనుబంధ సంస్థలలో వాణిజ్య పన్నుల శాఖాధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం నుంచి రాత్రి 11గంటల వరకు కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీలతో పాటు నగరంలో సుమారు 10చోట్ల సోదాలు నిర్వహించారు. షాపుల్లో ఉన్న బ్రాండ్స్‌కు సంబంధించి కొనుగోలు వివరాలు.. ఎప్పుడు ఆర్డర్ ఇచ్చారు.. ఎక్కడి నుంచి సరఫరా అయింది? వాటికి సంబంధించిన లేబుల్స్ వివరాలను సేకరించారు. సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు వివరించిన తర్వాత తదుపరి చర్యలుంటాయని అధికారులు పేర్కొన్నారు.

విదేశాలకు తల వెంట్రుకలు ఎగుమతిలో అక్రమాలు

● ఈడీ ప్రాసిక్యూషన్ ఫిర్యాదును అనుమతించిన కోర్టు

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విదేశాలకు తల వెంట్రుకలు (జుట్టు) ఎగుమతి చేసి కోట్ల రూపాయలు అక్రమాలకు పాల్పడ్డ కేసులో ఈడీ దాఖలు చేసిన ప్రాసిక్యూషన్ ఫిర్యాదును కోర్టు అనుమతించింది. జుట్టు అక్రమ ఎగుమతులపై ఈడీ నైల ఫ్యామిలీ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్‌కు చెందిన 17 మందిపై మనీలాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఇందుకు సంబంధించిన ప్రాసిక్యూషన్ ఫిర్యాదును గత ఆగస్టు 21న నాంపల్లి పీఎంఎల్‌ఏ ప్రత్యేక న్యాయస్థానంలో దాఖలు చేసింది. ఈ ఫిర్యాదును కోర్టు ఇటీవలే అనుమతించినట్లు ఈడీ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మానవ వెంట్రుకలను మిజోరం వద్ద భూమార్గంలో మయన్మార్, చైనా, బంగ్లాదేశ్, వియత్నాంకు ఎగుమతి చేసినట్లు లభించిన ఆధారాల మేరకు హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. మనీలాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు చేపట్టింది. కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ పలు ప్రాంతాల్లో జరిపిన సోదాల్లో రూ.1.21 కోట్లు లెక్కలో లేని నగదును స్వాధీనం చేసుకోవడంతో పాటు బ్యాంకు ఖాతాల్లోని రూ.7.85 కోట్లు ఫ్రీజ్ చేసింది.